

సౌదీలో మృతిచెందిన కుటుంబాలకు ఆత్మశాంతి చేకూరాలని సామూహిక ప్రార్థనలు చేస్తున్న మహమూద్‌అలీ, అలీ మస్కతి, అఖ్లక్ హుస్సేన్

సౌదీలో 18మంది మృతి విచారకరం

● మాజీ మంత్రి మహమూద్ అలీ

ముషీరాబాద్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి) : ఒకే కుటుంబానికి చెందిన 18మంది సౌదీలో మృతిచెందడం చాలా బాధాకరమని మాజీ హోంశాఖ మంత్రి మహమూద్‌అలీ అన్నారు. గురువారం ముషీరాబాద్‌కు చెందిన బీఆర్‌ఎస్ మైనార్టీ నేతలతో కలిసి విద్యానగర్‌లోని బాధిత కుటుంబాన్ని మహమూద్‌అలీ పరామర్శించారు. ఈ సందర్భంగా మృతిచెందిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని సామూహిక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు అలీమస్కతి, హర్షద్ అలీఖాన్, అఖ్లక్‌హుస్సేన్, జహీరుద్దీన్ నమర్, మున్వర్‌చాంద్, ఖదీర్, సయ్యద్ అహ్మద్ భక్తియార్, ముక్తార్ హుస్సేన్ పాల్గొన్నారు.

వెంకటసూర్యకుమారి సేవలు మరువలేనివి : ఎమ్మెల్యే



వెంకటసూర్యకుమారి విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే గోపాల్, ముఠా జైసింహ

ముషీరాబాద్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి) : బీఆర్‌ఎస్ సీనియర్ నాయకురాలు వెంకటసూర్యకుమారి సామాజిక సేవలు మరువలేనివని ఎమ్మెల్యే ముఠా గోపాల్ కొనియాడారు. గురువారం ముషీరాబాద్‌లో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు టెంట్‌హౌస్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో దివంగత బీఆర్‌ఎస్ మహిళా కమిటీ సీనియర్ నాయకురాలు వెంకటసూర్యకుమారి 11వ వర్ధంతి సభను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ పేదలకు అండగా నిలవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర మాజీ కార్యదర్శి ఎడ్ల హరిబాబుయాదవ్, బీఆర్‌ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ, ముషీరాబాద్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీధర్‌రెడ్డి, ఆకుల అరుణ్‌కుమార్, పార్టీ నాయకులు శివముదిరాజ్, ముచ్చకుర్తి ప్రభాకర్, గోరక్‌నాథ్, బల్వంత్ పాల్గొన్నారు.

వాకర్స్‌కు మెరుగైన సేవలు అందించాలి : ఎమ్మెల్యే

రాంనగర్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి) : బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్యపార్కులో వాకర్స్‌కు మెరుగైన సేవలు అందించేందుకు నూతన అధ్యక్షుడు కృషి చేయాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ సూచించారు. గురువారం వాకర్స్‌క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ నూతన కమిటీ అధ్యక్షుడిగా ఎన్నికైన ఎస్.మనోహర్‌రెడ్డిని ఎమ్మెల్యే సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ ఆఫ్ ఇంటర్నేషనల్ మాజీ అధ్యక్షుడు వి.నాగభూషణం, పి.వి.నిరంజన్‌రెడ్డి, ఎస్.రమేష్‌రెడ్డి, మురళీకృష్ణ, శైలజమోహన్, సంతోష్‌గౌడ్, ఆర్.వివేక్, కృష్ణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

21న గంగపుత్రుల వల విసిరే పోటీలు

ముషీరాబాద్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రపంచ మత్స్య దినోత్సవం సందర్భంగా ఈనెల 21న ఉదయం 10గంటలకు గంగపుత్రుల వలవిసిరే పోటీలు నిర్వహిస్తున్నట్లు గంగపుత్ర మహాసభ అధ్యక్షుడు ప్రసాద్ తెలిపారు. గంగపుత్ర మహాసభ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ పోటీలను ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభిస్తారని పేర్కొన్నారు. ఈ పోటీలను ముషీరాబాద్‌లోని వాలిబాల్ గ్రౌడ్‌లో నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి గంగపుత్ర మహాసభ జాతీయ అధ్యక్షుడు ఆర్.కె. ప్రసాద్, నాయకులు సాయిలు, సురేష్, ఆనంద్, రాంచందర్, శంకర్, శివప్రసాద్, పూస గోరక్‌నాథ్ తదితరులు హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గంగపుత్రులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

లంబాడీతండాలో సీసీ రోడ్డు నిర్మించాలి : రవిచారి



రోడ్డు సమస్యను అడిగి తెలుసుకుంటున్న కార్పొరేటర్ రవిచారి, జీహెచ్ఎంసీ అధికారులు

రాంనగర్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి) : రాంనగర్ డివిజన్ బాగ్‌లింగంపల్లిలోని లంబాడీ తండాలో సీసీ రోడ్డు నిర్మించి ప్రజల ఇబ్బందులు తొలగించాలని కార్పొరేటర్ కె.రవిచారి జీహెచ్ఎంసీ అధికారులను కోరారు. గురువారం జీహెచ్ఎంసీ ఏఈ విశ్వనాథ్, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ దేవేందర్ ఇతర సిబ్బందితో కలిసి ఆయన లంబాడీ తండాలో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా బస్తీలో రోడ్డు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని బస్తీ మహిళలు ఫిర్యాదు చేశారు. ఇందుకు స్పందించిన ఆయన వెంటనే రోడ్డు నిర్మించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. నూతన రోడ్డు నిర్మాణానికి వెంటనే ప్రతిపాదనలు పంపిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బస్తీ నాయకులు కల్యాణ్‌నాయక్, శ్రీనివాస్, వెంకటేష్, బస్సినాయక్, బీజేపీ నాయకులు ఉపేందర్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య సమస్య పరిష్కారానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి

రాంనగర్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి) : బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లో పారిశుధ్య సమస్య పరిష్కారానికి జీహెచ్ఎంసీ సానిటేషన్ విభాగం అధికారులు, సిబ్బంది కృషి చేయాలని కార్పొరేటర్ బి.పద్మావెంకట్‌రెడ్డి సూచించారు. గురువారం శారదానగర్‌లో పారిశుధ్యం సమస్యపై అంబర్‌పేట సర్కిల్ సానిటేషన్ అధికారి డాక్టర్ హేమలత ఇతర సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బస్తీల్లోని చాలా ప్రాంతాల్లో చెత్త, చెదారం పేరుకుపోయిందని, దీంతో స్థానిక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. వెంటనే చెత్త, చెదారం తరలించడంతో పాటు బస్తీల్లో ఈగలు, దోమల బెడద సమస్య లేకుండా చూడాలన్నారు. డా.హేమలత మాట్లాడుతూ చెత్త సమస్య తలెత్తకుండా చర్యలు చేపడతామన్నారు. ప్రజలు రోడ్లపై చెత్త వేయకుండా స్వచ్ఛ ఆటోలోనే వేయాలన్నారు.



మాట్లాడుతున్న ఈస్ట్‌జోన్ అదనపు డీసీపీ జోగుల నర్సయ్య తదితరులు

బాలల హక్కుల పరిరక్షణకు కృషి చేయాలి

రాంనగర్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): బాలల హక్కుల గురించి ప్రజల్లో అవగాహన కల్పించాలని, వారి హక్కులను పరిరక్షించడానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. గురువారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో ఎస్ఆర్‌డీ, ఆశ్రిత, ఎస్ఈఎస్ స్వచ్ఛంద సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలల హక్కుల దినోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఈస్ట్‌జోన్ అదనపు డీసీపీ జోగుల నర్సయ్య హాజరై మాట్లాడారు. గొప్ప, పేద అని తేడా లేకుండా బాలలందరికీ సమాన హక్కులు ఉన్నాయన్నారు. సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని, కొంతమంది పిల్లలు పక్కదారిన పడుతున్నారని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విద్య ద్వారా జీవితాలు మారుతాయన్నారు. కార్మికశాఖ అధికారి నీలిమ, డాక్టర్ సుబ్బారాయు డు, శ్రీనివాస్, విజయభాస్కర్, శ్రీనివాస్‌రెడ్డి, జయశ్రీ, నాగరాజు, మంజుల పాల్గొన్నారు.

ప్రభుత్వం జాబ్‌క్యాలెండర్ విడుదల చేస్తుంది

● నగర కేంద్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేశిరెడ్డి ఉపేందర్‌రెడ్డి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న చైర్మన్ ఉపేందర్‌రెడ్డి, అదనపు కలెక్టర్ పళని కదిరవన్, కార్యదర్శి పొట్లూరు పద్మజ

చిక్కడపల్లి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం తప్పకుండా జాబ్ క్యాలెండర్ విడుదల చేసి ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు ఇస్తుందని నిరుద్యోగ విద్యార్థులు బాగా చదివి ఉద్యోగాలు సాధించాలని హైదరాబాద్ నగర కేంద్రగ్రంథాలయ సంస్థ చైర్మన్ కేశిరెడ్డి ఉపేందర్‌రెడ్డి అన్నారు. 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సమావేశం గురువారం చిక్కడపల్లిలోని సిటిసెంట్రల్ లైబ్రరీలో జరిగింది. ఈసందర్భంగా బహుమతులను అదనపు కలెక్టర్ పళని కదిరవన్, గ్రంథాలయ కార్యదర్శి పొట్లూరు పద్మజతో కలిసి కేశిరెడ్డి ఉపేందర్‌రెడ్డి బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి దృష్టికి కూడా నిరుద్యోగుల బాధలు తెలియజేసి నోటిఫికేషన్లు ఇచ్చేవిధంగా తమవంతు ప్రయత్నాలు తప్పకుండా చేస్తామన్నారు. అదనపు కలెక్టర్ పళని కదిరవన్ మాట్లాడుతూ ప్రజలకు విజ్ఞానాన్ని అందించేవిధంగా గ్రంథాలయాలను తీర్చిదిద్దడంలో ఉద్యోగులు తమ విధులను అంకితభావంతో నిర్వహించడమే కారణమన్నారు. నిరుద్యోగులు అధైర్యపడకుండా ఆత్మవిశ్వాసంతో పోటీపరీక్షలకు సిద్ధమై ఉద్యోగాలు సాధించే దిశలో కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా నిరుద్యోగులు కృష్ణ, బాలకోటి, నరేష్‌లు మాట్లాడుతూ పదేళ్ళ కేసీఆర్ పాలనలో ఒక్క నోటిఫికేషన్ ఇవ్వలేదని దీంతో తమకు ఉద్యోగాలు రాలేదన్నారు. సీఎం దృష్టికి తమ నిరుద్యోగుల బాధలు తీసుకువచ్చి నోటిఫికేషన్లు వచ్చేవిధంగా కృషి చేయాలని లైబ్రరీ చైర్మన్‌ను కోరారు. కాగా బహుమతుల పంపిణీ సందర్భంగా 2023 సంవత్సరానికి సంబంధించిన పోటీ పరీక్షల మెటీరియల్ పుస్తకాలను ఇవ్వడంతో సమావేశంలో పాల్గొన్న నిరుద్యోగ విద్యార్థులు తమ నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ ఉద్యోగులు, నిరుద్యోగులు, పోటీపరీక్షల అభ్యర్థులు, పాఠకులు పాల్గొన్నారు.

గొప్ప ఇంజనీర్, రాజనీతిజ్ఞుడు మోక్షగుండం



మాట్లాడుతున్న మధుసూదనాచారి, పక్కన కళాజనార్ధనమూర్తి తదితరులు

చిక్కడపల్లి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): పేరెన్నికగన్న సివిల్ ఇంజనీర్, రాజనీతిజ్ఞుడు, పండితుడు మోక్షగుండం విశ్వేశ్వరయ్య అని కౌన్సిల్‌లో ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి అన్నారు. త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో జరుగుతున్న ఎందరో మహానుభావులు శీర్షికన జరుగుతున్న కార్యక్రమాల పరంపరలో గురువారం భారతరత్న పురస్కార గ్రహీత మోక్షగుండం విశ్వేశ్వరయ్య యాదిలో సమావేశం గానసభ అధ్యక్షుడు కళా జనార్ధనమూర్తి అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా మధుసూదనాచారి మాట్లాడుతూ విశ్వేశ్వరయ్య చేసిన సేవలకు గుర్తింపుగా సెప్టెంబర్ 15న దేశవ్యాప్తంగా ఇంజనీర్స్‌డేగా జరుపుకుంటారని గుర్తుచేశారు. వరదనియంత్రణ, నీటి నిర్వహణ, ఆనకట్టల రూపకల్పనలో విశ్వేశ్వరయ్య ప్రతిభ ఎన్నదగిందన్నారు. ఖడక్ వాస్ల ప్రాజెక్టు, ఆటోమెటిక్ స్లాట్ గేట్ల రూపకల్పన ద్వారా ఆయన ఎంతో ప్రసిద్ధి చెందారన్నారు. హైదరాబాద్ నగరాన్ని వరదలనుంచి రక్షించడానికి మూసీనది, వరదనియంత్రణ ప్రణాళిక, ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ జలాశయాల రూపకల్పనలో ప్రధాన కారకుడిగా పనిచేశారన్నారు. క్రమశిక్షణ, కర్తవ్యనిష్ఠ, జాతీయాభివృద్ధి పట్ల అంకితభావం, కారణంగా ఆయనను ఆధునిక ఋషిగా పిలుస్తారన్నారు. భారత ఇంజనీరింగ్ రంగానికి ఆయన చూసిన మార్గం ఇంజనీర్‌లకు నేటికి కూడా స్ఫూర్తిగా నిలుస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో రచయిత్రి శైలజామిత్ర, గాయని గరిమెళ్ళ సీత, గానసభ పాలకమండలి సభ్యులు బండి శ్రీనివాస్ పాల్గొన్నారు.

పెండింగ్ పనులకు నిధులు మంజూరు చేయాలి

● మేయర్‌కు బీజేపీ నేతల వినతి



మేయర్ విజయలక్ష్మికి వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నేతలు

కవాడిగూడ, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): కవాడిగూడ డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న మున్సిపల్ పనులకు వెంటనే అనుమతులు ఇచ్చి నిధులు మంజూరు చేయాలని బీజేపీ నేతలు మేయర్ గద్వాల విజయలక్ష్మికి విజ్ఞప్తి చేశారు. కార్పొరేటర్ జి రచనశ్రీ, పార్టీ రాష్ట్ర నాయకుడు జి వెంకటేష్, నగర నాయకులు ఎం సీ మహేందర్‌బాబు, బీజేపీ డివిజన్ అధ్యక్షుడు సలంద్రి దిలీప్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి బొల్ల రమేష్, ఓబీసీ మోర్చా డివిజన్ అధ్యక్షుడు ఎ. ప్రభాకర్ గంగపుత్ర, శివరాజ్‌లు గురువారం విజయలక్ష్మిని కలిసి వినతిపత్రం అందజేశారు. డివిజన్‌లోని అడ్వకేట్స్‌కాలనీ, కొత్త బజార్, పూల్‌బాగ్, గంగపుత్ర గల్లి తదితర బస్తీలలో సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరయ్యేలా చొరవ తీసుకోవాలన్నారు. దోమలగూడ మున్సిపల్ మార్కెట్ వద్ద నిర్మించిన సర్కిల్ కార్యాలయాన్ని వెంటనే ప్రారంభించాలని కోరారు. ఇందుకు స్పందించిన మేయర్ ప్రతిపాదనలు అధికారులకు పంపి నిధులు మంజూరు చేసేలా, సర్కిల్ కార్యాలయాన్ని త్వరలోనే ప్రారంభించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారని రచనశ్రీ తెలిపారు.

ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్నభోజన పథకాన్ని అమలు చేయాలి

● బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ



మాట్లాడుతున్న వేముల రామకృష్ణ తదితరులు

బర్కత్‌పుర, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఏపీ మాదిరిగా రాష్ట్రంలో ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్నభోజన పథకాన్ని అమలు చేసి డ్రాప్ అవుట్ సంఖ్యలు తగ్గించాలని తెలంగాణ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ డిమాండ్ చేశారు. గురువారం కాచిగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 425 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో లక్ష 70వేల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని, కళాశాలలన్నీ మండల, జిల్లా, నియోజకవర్గ కేంద్రాల్లో ఉండడం వల్ల దూరప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు భోజనం లేక కాలే కడుపులతో కళాశాలలకు వస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చాలా మంది పేద విద్యార్థులు మధ్యాహ్నమే ఇళ్లకు వెళ్లిపోతుండడంతో డ్రాప్ అవుట్ సంఖ్య పెరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం ప్రవేశపెట్టాలని, దీనిపై సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆనంద్, పవన్, యశ్వంత్, అజయ్, గణేష్, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

విశ్వం మృతి బీజేపీకి తీరని లోటు

● నివాళులర్పించిన రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ



విశ్వం భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, రాష్ట్ర నాయకులు సదానంద్, నందు, కనకేష్ కుమార్



నివాళులర్పిస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

ముషీరాబాద్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్‌కు చెందిన బీజేపీ రాష్ట్ర నాయకుడు ఆర్ విశ్వం(69) మృతిచెందడం పార్టీకి తీరని లోటని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రాంచందర్‌రావు, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ కొనియాడారు. ఆర్ విశ్వం మృతిచెందిన విషయం తెలుసుకున్న బీజేపీ నాయకులు గురువారం ముషీరాబాద్‌లోని ఆయన నివాసానికి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రాంచందర్‌రావు, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఎమ్మెల్యే ముఠాగోపాల్, నియోజకవర్గ కన్వీనర్ రమేష్‌రాం, కార్పొరేటర్లు సుప్రియానవీన్‌గౌడ్, రవిచారి, పావనివినయ్‌కుమార్, రచనశ్రీ, బీజేపీ మహంకాళి జిల్లా అధ్యక్షుడు భరత్‌గౌడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతంరావు, మహిళా మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి బండారు విజయలక్ష్మి, రాష్ట్ర నాయకులు సి.కె శంకర్‌రావు, సదానంద్‌ముదిరాజ్, నందగిరి నర్సింహ, బిజ్జి కనకేష్‌కుమార్, డివిజన్ అధ్యక్షుడు రాజశేఖర్, బీఆర్ఎస్ యువనాయకుడు ముఠా జైసింహ, శివముదిరాజ్, దీన్‌దయాల్‌రెడ్డి, వీరశైవ లింగాయత్ సమాజం ముషీరాబాద్ ముఖ్య సలహాదారుడు వీరేష్, ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. వారి కుటుంబానికి ధైర్యం చెప్పారు. ఆర్ విశ్వం జంగమ సమాజం కులస్థులకు, పార్టీ అభ్యున్నతికి ఎంతో కృషిచేశారని పేర్కొన్నారు. విశ్వం అంత్యక్రియలు ముషీరాబాద్‌లోని హిందూ శ్మశానవాటికలో జరిగాయి. అంతిమ యాత్రలో వివిధ పార్టీల నేతలు, జంగమ సమాజం నేతలు పాల్గొన్నారు.

పేద విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి



విద్యార్థులకు నోట్‌బుక్స్‌ను పంపిణీ చేస్తున్న డాక్టర్ గౌతమ్‌రావు, కావ్యకిషన్‌రెడ్డి తదితరులు

బర్కత్‌పుర, నవంబరు 20(ఆంధ్రజ్యోతి) : పేద విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకుని కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని కేంద్రమం త్రి జి.కిషన్‌రెడ్డి సతీమణి కావ్యకిషన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు పిలుపునిచ్చారు. విద్యార్థులు తమ విజ్ఞానాన్ని దేశాభివృద్ధికి దారబోయాలన్నారు. గురువారం కాచిగూడ ప్రభుత్వ జూనియర్ కళాశాల, కాచిగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు నోటు పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు. సమరయోధుడు, యాదవ రత్న చిట్టబోయిన వీరప్పయాదవ్ 11వ వర్ధంతి సందర్భంగా వీరప్పయాదవ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చది వే విద్యార్థులకు దాతలు సహకారం అందించాలని వారు పిలుపునిచ్చారు. కళాశాలకు అవసరమైన కుర్చీలను ట్రస్ట్ చైర్మన్ సి.నందకిషోర్ యాదవ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కన్నె ఉమాదేవి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.చిరంజీవి, నాయకులు కన్నె రమేష్‌యాదవ్, సి.వినోద్‌యాదవ్, ఎక్కాల కన్నా, శ్యామ్‌రాజ్, సుభాష్ పటేల్, క్షీరసాగర్, భీమ్‌రాజ్, సందీప్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

టీపీసీసీ తెలంగాణ కో ఇన్‌-చార్జి కార్యదర్శికి సన్మానం



సచిన్ సావంత్‌ను సన్మానిస్తున్న కెన్నెడిక్రుపారావు, శ్రీనివాస్‌రెడ్డి

చిక్కడపల్లి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జి కార్యదర్శి సచిన్ సావంత్ టీపీసీసీ తెలంగాణ కోఇన్‌చార్జిగా నియమితులై నగరానికి చేరుకున్న సందర్భంగా ఆయనను కాంగ్రెస్ రాష్ట్ర సీనియర్ నేతలు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ సీనియర్ నేత కెన్నెడి కృపారావు, శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ గాంధీనగర్ డివిజన్ అధ్యక్షుడు అభిషేక్ కెన్నడీలు సచిన్‌సావంత్‌ను గాంధీభవన్‌లో గురువారం కలిసి సన్మానించారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి తీసుకుంటున్న చర్యలు వివరించారు.



లింగంగౌడ్ కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కాలేరు

లింగంగౌడ్ కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

గోల్నాక, నవంబర్ 20(ఆంధ్రజ్యోతి): గోల్నాక డివిజన్‌కు చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు బోయపల్లి లింగంగౌడ్ మృతిచెందగా గురువారం ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ న్యూగంగానగర్‌లోని మృతుడి నివాసానికి వెళ్లి ఆయన కుటుంబసభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ కోసం అంకితభావంతో సేవలందిస్తూ, స్థానిక ప్రజల సమస్యల పరిష్కారంలో ముందుండి పనిచేసిన నేతగా లింగంగౌడ్ ప్రజల ఆదరణ పొం దారన్నారు. లింగంగౌడ్ సేవాభావం, ప్రజల పట్ల ఉన్న అనురాగం, నీతి, నిజాయితీని ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్మరించుకున్నారు. లింగంగౌడ్ మరణం బీఆర్ ఎస్ పార్టీకి తీరని లోటని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఆర్.కె.బాబు, ఎ.సురేష్‌గౌడ్, వై.బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా కార్తీకమాస పూజలు

చిక్కడపల్లి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం సందర్భంగా చిక్కడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు పూజలు నిర్వహిస్తున్నారు. గురువారం కార్తీకమాసం ముగింపు కావడంతో సాయంత్రం ఆలయానికి పెద్దఎత్తున భక్తులు చేరుకుని శివాలయంలో పూజలు నిర్వహించారు. కార్తీక దీపాలు వెలిగించారు. ఆలయ వ్యవస్థాపక వంశీయులు జి రాజేంద్రనాథ్‌గౌడ్ కుమారుడు శ్రీనాథ్‌గౌడ్, ఈవో రామాంజనేయులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పార్వతీ క్షీరలింగేశ్వరస్వామి మందిరంలో..

చిక్కడపల్లి : కార్తీకమాసం చివరిరోజు గురువారం రాత్రి ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని లక్ష్మీగణపతి ఆలయం ఆవరణలోని పార్వతీ క్షీరలింగేశ్వరస్వామి మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంటు జాయింట్ కన్వీనర్ ఎ. వినయ్‌కుమార్ పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు నిర్వహించిన అన్నప్రసాద వితరణలో వారు పాల్గొన్నారు. ఈవో లక్ష్మారెడ్డి ఏర్పాట్లు పర్యవేక్షించారు. విశ్వేశ్వర్, సాయిబాబా, నరసింహారెడ్డి, ప్రభాకర్, శ్రీనివాస్, సతీష్, నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శివపార్వతుల కల్యాణం

రాంనగర్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): రాంనగర్ రామాలయంలో కార్తీకమాసాన్ని పురస్కరించుకుని గురువారం శివపార్వతుల కల్యాణోత్సవం ఘనంగా జరిగింది. ఆలయంలో ఉదయం జ్వాల తోరణం, దీపోత్సవం, మాస శివరాత్రి పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు వెంకటరమణాచారి వేణుగోపాలశర్మ పలువురు పూజారులు పాల్గొని శివపార్వతుల కల్యాణోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ఆనంద్‌తో పాటు ధర్మకర్తలు, సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులకు తీర్థప్రసాద వితరణ జరిగింది.



అభివాదం చేస్తున్న గడ్డ యాదయ్య మాదిగ తదితరులు

'రాజీవ్ వికాస్'కు నిధులు మంజూరు చేయాలి

రాంనగర్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి) : రాజీవ్ వికాస్ పథకానికి వెంటనే నిధులు మంజూరు చేయాలని తెలంగాణ మాదిగ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డ యాదయ్య మాదిగ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో తెలంగాణ మాదిగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రాజీవ్ వికాస్ పథకం అంశంపై సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో దళితులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం దళితులకు వ్యతిరేకంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. దళితులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బంధు సొసైటీ అధ్యక్షుడు పల్లె వీరస్వామి, న్యాయవాది మల్లన్న, నాయకులు పురుషోత్తం, రాంచందర్, కల్యాణి, కల్ప, విజయలక్ష్మి, లక్ష్మీనారాయణ, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుడు బల్వంత్‌రెడ్డి మృతి



బల్వంత్‌రెడ్డి(ఫైల్)

రాంనగర్ : కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కె.బల్వంత్‌రెడ్డి(75) బాకారంలోని ప్రశాంత్ టవర్స్ నివాసంలో గురువారం మృతిచెందారు. ఆయనకు భార్య, కుమారుడు శ్రీధర్‌రెడ్డి, కుమార్తె ఉన్నారు. ఆయన మాజీ ఎమ్మెల్యే ఎం.కోదండరెడ్డితో కలిసి ముషీరాబాద్ నియోజకవర్గంలో పనిచేశారు. ఆయన కుమార్తె అమెరికాలో ఉన్నందున ఈనెల 22వ తేదీన అంత్యక్రియలు జరుగుతాయని ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన అంతిమయాత్ర మధ్యాహ్నం 1 గంటకు ప్రశాంత్ టవర్స్ నుంచి శ్మశానవాటిక వరకు సాగుతుందని తెలిపారు. ఆయన మృతిపట్ల బాకారం ధర్మాచరణ సమితి అధ్యక్షుడు పాశం అనిల్‌కుమార్‌యాదవ్, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లవెల్లి అంజిరెడ్డి, మాజీ కార్పొరేటర్ ఆర్. కల్పనాయాదవ్, వాజీద్ హుస్సేన్, పూస శ్రీకృష్ణ, రాజు సంతాపం వ్యక్తం చేశారు.